# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## ధరణి బంద్ జేస్తే రైతులకు గోసే..

చిట్యాల : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి బంద్ జేస్తమని ఆ పార్టీ నాయకులంటున్నరు. మళ్ల రెవెన్యూ ఆఫీసుకు పోయి పని చేసుకోవాలంటె చాలా ఇబ్బందిగా ఉంటది. అధికారులు అక్కడున్నం.. ఇక్కడున్నం అని ఆఫీసుల చుట్టు తిప్పుకుంటరు. ఇప్పుడు ధరణిలో స్లాట్‌బుక్ చేసుకుంటే ఎవరికీ ఒక్క పైసా ఇవ్వకుండా పని జరిగిపోతాంది. రికార్డులన్ని మారిపోతున్నయి. ధరణి తీసేస్తే మళ్లీ అవినీతి పెరిగిపోతది. రైతులకు ఇబ్బందులు వస్తయి. భూముల వివరాలు సక్రమంగా ఉండవు. కాంగ్రెస్ హయాంల కొనాలన్న, అమ్మాలన్న చాలా ఇబ్బందులుండేవి. రిజిస్ట్రార్ ఆఫీసుకు పోతే గీ కాయితం లేదు, సంతకం లేదు, అని గోస ఉంటుండె. పైసలిస్తేనే పాసు బుక్కులు ఇచ్చేది. సీఎం కేసీ ఆర్ ధరణిని తీసుకచ్చినంక రాతకోతలు, పాసుబుక్కులు ఆన్ లైన్ అయి ఒక్కతాన్నే జరుగుతున్నాయి. ధరణి పోర్టల్ ఇట్లనే ఉండాలె. రైతులకు మేలు జరగాలె.


**- కసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతు, నవాబుపేట**

*కాంగ్రెస్ పాలన ఉంటే కరెంటు ఉండదని రైతులే కుండబద్దలు కొడుతున్నారు. ఆ పార్టీకి రైతుల మేలు పట్టదని, మళ్లీ దళారుల రాజ్యం తెచ్చి అన్నదాతలను ఆగంజెయ్యాలని చూస్తున్నరని విమర్శిస్తున్నారు. నాడు కరెంటు ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో తెల్వక పనులన్నీ విడిచిపెట్టి పొలంకాడ ఉండేటోళ్లమని, రాత్రిపూట బిక్కుబిక్కుమనుకుంట కటిక చీకట్ల పొలాల కాడికి పోయేవాళ్లమని, ఇప్పుడా బాధలు లేవని చెబుతున్నారు. కాంగ్రెస్ వాళ్లకు వ్యవసాయాన్ని ఎలా బాగు చేయాలో తెల్వదని, రైతులకు ఏంజేస్తే బాగుంటుందో వాళ్లకు తెల్వదని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల బాధలు తీర్చుతున్నాడని పేర్కొంటున్నారు. తమకు రైతుబంధు, 24గంటల కరెంటు, రైతుబీమా, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ మద్దతు అంటూ స్పష్టం చేస్తున్నారు. 3గంటల కరెంటు వ్యవసాయానికి ఎట్ల సరిపోతుందో రేవంత్ రెడ్డే ఎవుసం చేసి చూపించాలె అని నిలదీస్తున్నారు. మూడు గంటలే సరిపోతే నాడు కాంగ్రెస్ పాలనలో నాలు గైదు గంటల కరెంటు ఉన్నప్పుడు పొలాలకు నీళ్లు పారినయా అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి దిక్కూదివానం లేని మాటలు మాట్లాడి రైతులను ఆగంచెయ్యవద్దని, ఇప్పుడిప్పుడే మంచిగవుతున్న ఎవుసాన్ని మళ్లీ ముంచే ప్రయత్నం చేయొద్దని హెచ్చరిస్తున్నారు.*

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 26**




- నాడెవలన్న సచ్చిపోతే స్నానాలకు కూడా కరెంటుండకపోవు..
- మూడు గంటలకు మూడు గుంటలు కూడా పారయ్
- 24గంటల కరెంటుతోనే మేలు
- ఇప్పుడే ఎవుసం మంచిగైంది.. మళ్లీ ముంచొద్దు
- భూముల కొట్లాటలు మళ్లీ తేవద్దు
- హస్తం నేతల మాటలపై రైతుల మండిపాటు
- 'కేసీఆర్‌కే మా సపోర్టు' అంటున్న అన్నదాతలు



## కాంగ్రెస్ పాలన వస్తె కరెంట్ రాదు..

రేగొండ : కాంగ్రెస్ పాలన వస్తె ఇగ ఎవుసానికి కరెంట్ రాదు. అప్పట్లో ఆ బాధలు పడలేకనె ఎవుసం వదిలి కూలి పనులకు పోయినం. గిప్పుడు గా కాంగ్రెస్ పాలన వస్తె మళ్లా సంసారం మొదటికి వచ్చినట్లె. అధికారంలోకి రాక ముందే రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటూ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. ఇక్కడ నీళ్లు పైనే ఉంటయి. ఇప్పటి వరకు 3 హెచ్‌పీ మోటర్లే వాడుకుంటున్నం. ఎవరో ఒకరిద్దరు 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకున్నరు. గిప్పుడ గాయన 10 హెచ్‌పీ మోటర్లు పెట్టమంటె మా దగ్గర పైసలు లేవుజ అప్పులు చేసి ఉన్న భూమలు అమ్మకోవాల్సిందు. కేసిఆర్ సార్ రైతు కుటుంబంలో పుట్టి పేరిగిండు కాబట్టి రైతు బాధలు తెలిసి వాళ్లు తలెత్తుకొని బతికేలా నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడంతో పంటలు మంచిగ పండి నాలుగు పైసలు సంపాదించుకుంటున్నం. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా రైతుల మేలు కోరే కేసిఆర్ సారుకు మద్దతుగా ఆయన వెంట నడుస్తం. ఎవరు మమ్ములను ఆపలేరు.

**- ఏనుగు బాల్‌రెడ్డి రైతు, రాజక్కపల్లే, రేగొండ**





## రైతుల భూములకు భద్రత

భూపాలపల్లి రూరల్ : కాంగ్రెస్ వస్తే రైతులకు మునుపటి లెక్క కష్టాలు తప్పవు. ధరణి వచ్చింకనే రైతులకు, భూములకు రక్షణ దొరికింది. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రైతులకు నిజమైన సంతోషం. దళారీ రాజ్యం తీసుకచ్చి నిరుపేద రైతులను దోచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నుతున్నరు. కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ ఎంతో బాగుంది. రైతుల భూములు భద్రంగా ఉండాలంటె ధరణి ఉండాల్సిందే. ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు క్షణాల్లో మ్యుటేషన్ అయిపోతాంది. ధరణి రాకతో భూమి విలువ పెరిగింది. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగినా మా సమస్యలు తీరకపోయేటివి. ఎంత ప్రయత్నించినా ప్రభుత్వ భూములు కబ్జాకు గురికావు. ఎవరైనా అక్రమంగా భూమిని ఎక్కించుకుని ఉంటే తొలగించవచ్చు. ధరణితో రైతుల భూమిని మ్యాప్ ద్వారా చూసుకోవచ్చు. పాత, కొత్త పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇవన్నీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో ధరణి తీసుకొచ్చి రైతులకు ఉపయోగపడేటట్టు చేసిండు. ధరణిని యథావిధిగా కొనసాగిస్తేనే రైతులకు అన్ని విధాల మంచి జరుగుతుంది.

**- పెరుమాండ్ల మల్లేశ్, వేశాలపల్లి, భూపాలపల్లి మండలం**



## కాంగ్రెసోళ్లకు ఎవుసం ఎర్కేనా?

గోవిందరావుపేట : కాంగ్రెసోళ్లు 24 గంటల కరెంట్ అవసరం లేదు, 3 గంటల కరెంట్ సాలు అని అంటున్నరు. 3 గంటల కరెంట్‌తో ఏ మూలకు నీరు పారిచ్చుకోవాలె. కాంగ్రెసోళ్లకు ఎవుసంపై అవగాహన లేకనే అలా మాట్లాడుతున్నరు. సన్న, చిన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటరు పెట్టుకునే పరిస్థితి లేదు. ఆ మోటరు కొనాలంటే రూ.50 వేలకు పైనే ఖర్చయితది. మోటరుతో పాటు పైపులు, ఇతర సామగ్రికి మరిన్ని డబ్బులు ఖర్చయితయి. ఇంత ఖర్చుపెట్టి ఆ మోటరు కొనగలమా? కాంగ్రెసోళ్లకు అవగాహన లేక మాట్లాడుతున్నరు. 24 గంటలు ఫ్రీగా కరెంట్ ఇస్తున్న ప్రభుత్వంపై కాంగ్రెసోళ్లు ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదు.

**-తండా రమేశ్, రైతు, లక్నవరం, గోవిందరావుపేట మండలం**

## కేసీఆర్ అచ్చినంకనే కరెంట్ మంచిగుంటాంది..

ములుగు రూరల్ : 3 గంటల కరెంట్ అనే ముచ్చట దండుగ. రైతుల పంటలకు 24 గంటలు ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్నడు కదా. అదే మంచిగున్నది. 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుడు అనే విషయం మంచిగ లేదు. రైతులకు 24 గంటల కరెంట్‌తోనే లాభం జరుగుతుంది. కరెంట్ లేకుంటే పంటలు ఎక్కడ పండుతయి. 3 గంటల కరెంట్ ముచ్చటే వద్దు. ఇప్పుడున్న కరెంట్‌ను మళ్ల 3 గంటలు చేస్తామని అనడం తప్పు. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు రైతులకు సాలు.

**- ఒజ్జల కొమురయ్య, ఇంచర్ల, ములుగు మండలం**





## ధరణితోటి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత

కాటారం : రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు చేసి రైతులకు మేలు చేసే ధరణి ప్రారంభంతో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లలో రైతులకు పారదర్శకత లభిస్తున్నది. గతంలో రిజిస్ట్రేషన్లు ఒకచోట, మ్యుటేషన్లు మరోచోట జరిగేది. రైతులకు ఇబ్బంది కలగకుండా ఒక్కచోటునే అన్ని పనులు పూర్తి చేయడమే కాకుండా పాస్ పుస్తకాలు వెంటనే మంజూరు చేయడం రైతులకు వరం లాంటిది. ఎలాంటి అవినీతికి తావు లేకుండా రైతులకు లబ్ధిచేకూర్చే పథకాలు సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యం. రైతు ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నరు. రాష్ట్రంలో రైతులంతా కేసీఆర్‌కు రుణపడి ఉంటరు. రైతులకు మేలు చేసే ధరణి తీసేస్తాం అని ఎవరైనా అంటే ఓటు రూపంలో తగిన సమాధానం చెప్తాం. మా మద్దతు బీఆర్ ఎస్ పార్టీకే.

**- కుసుమ నరేశ్, రైతు, దేవరాంపల్లి, కాటారం**

## ధరణితో ధరలు పెరిగినయ్..

రేగొండ : తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల భూముల ధరలు పెరగడమే కాకుండా రక్షణ ఉంది. ఆనాటి కాంగ్రెస్ పాలనలో భూములకు భద్రత లేదు. ధరలు లేవు. సర్వే నంబరు ఒకటైతె పట్టాలో ఇంకోటి ఉండేది. మొత్తం తప్పుల తడక. దీంతో నిత్యం పంచాయితీలు, కొట్లాటలతో పోలీస్‌స్టేషన్లు, ఎమ్మార్వో ఆఫీసు చుట్టు తిరగడానికే నెలలు పట్టేది. కేసీఆర్ పుణ్యమా అని ధరణి రావడంతో లోపాలు లేకుండ మా భూములకు రక్షణ కల్పించిండు. పట్టాలు ఇవ్వడంతో మా భూములకు మంచి ధరలు కూడా వస్తున్నయి. బ్యాంకుల లోన్లు, రైతుబంధు, రైతుబీమా వర్తిస్తున్నయ్. అమ్మాలన్న, కొనాలన్న నిర్భయంగా కొంటున్నరు. గా రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి రద్దు చేస్తం.. మళ్ల పటేల్, పట్వారీ వ్యవస్థ, కౌలుదారు కాలం తెస్తం అంటూ నోటికచ్చింది మాట్లాడుతున్నడు. గట్లాంటి కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తం. రైతులకు మంచి చేసిన కేసీఆర్ సార్ వెంటే ఉంటం.

**- రూపిరెడ్డి లింగారెడ్డి, రంగయ్యపల్లె, రేగొండ**





## భూ రికార్డులు తారుమారైతయ్

మహదేవపూర్ : ధరణి వచ్చినంకనే రైతుల భూరికార్డుల సమస్యలు తీరినయ్. ఆన్‌లైన్‌లో మా భూముల లెక్కలు భద్రంగా ఉన్నయ్. ఆఫీస్‌లో పని కూడ ఇబ్బంది లేకుండా సులభంగా అయితాంది. ధరణితోనే రైతులకు రైతుబంధు, సంక్షేమ పథకాలు అందుతానయ్. రైతులందరు సంతోషంగ ఉన్నరు. ఇలాంటి ధరణి తీసేస్తమని కాంగ్రెసోళ్లు చెబుతాండ్రు. ఒకవేళ తీసేసి మునుపటి పాత రెవెన్యూ విధానం తెస్తె మళ్లా రైతులకు తిప్పలు తప్పవు. భూ రికార్డులు తారుమారయ్యే ప్రమాదం ఉంది. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మళ్లా రైతుల నడుమ కొట్లాటలు జరుగుతయ్. చిన్న తప్పు సరిచేసేందుకు రెవెన్యూ ఆఫీస్‌ల సుట్టు తిరుగుడైతది. దళారులు పుట్టకొస్తరు. వాళ్లదే రాజ్యం అయితది. రైతులను ఆగం చేత్తరు. అన్ని విధాల రైతులకు మేలు చేస్తున్న ధరణి కొనసాగాలంటే సీఎం కేసీఆర్ సారే మళ్లా రావాలె.

**- వెన్నపురెడ్డి రాంరెడ్డి, బొమ్మాపూర్, మహదేవపూర్**



## ఎవుసం బంద్ చేసుకోవాలె..

చిట్యాల: కాంగ్రెస్ నాయకులన్న 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్‌తో వ్యవసాయం చేస్తే రైతులు బాగుపడరు. 3 గంటల కరెంట్‌తో పొలాలన్ని ఎండిపోవడం ఖాయం. కరెంట్ మధ్యల పోవడంతో పారిన వరి నారంతా ఎండిపోయి పగుళ్లు పడుతది. రైతులందరు కరెంట్ కోసం కాపు కాయాల్సి వత్తది. మళ్లీ కాంగ్రెస్ పాలనలో ఎదురైన కరెంటు కష్టాలు గుర్తుకొస్తున్నయి. రైతులందరు ఒకేసారి ఆన్ చేయడంతో లోడ్ పడి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి. 3 గంటల కరెంట్ ఇస్తే వ్యవసాయాన్ని బంద్ చేసుకోవాల్సిన పరిస్థితి వత్తది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేత్తాంది. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు మాత్రమే నడుస్తయి. 10 హెచ్‌పీ మోటర్లతో పంటల సాగు చేయడం కష్టం. కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్ మాటలు వింటుంటే పాత కాలం కళ్ల ముందర కనబడ్తాంది.

**- పింగిళి రవీందర్‌రెడ్డి, రైతు, నవాబుపేట, చిట్యాల**



## 3 గంటల్లో అర ఎకరం తడవదు

ఏటూరునాగారం : రోజుకు 3 గంటల కరెంట్ ఇస్తే కనీసం అర ఎకరం కూడా తడవదు. ఇక యాసంగి పంట బంద్ పెట్టాల్సిందె. భూమి తడవాలంటే కరెంటు నిరంతరం ఉండాలి. 3 గంటలు కరెంట్ ఇస్తే రైతులు వ్యవసాయం ఏం చేస్తరు. పొలాలు ఎండిపోతయి. గతంలో తెలంగాణ రాకముందు కరెంట్ సక్కగ లేక రాత్రిపూట రైతులు కావలి కాసేది. ఇక పంటలు పండినట్లే. ఇప్పుడు 24 గంటలు కరెంట్ ఇస్తున్నరు. ఇదే కొనసాగాలి. 3 గంటల కరెంటు ఇస్తే ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెల్వదు. పడిగాపులు పడాలి. రైతులు వరి పంట పండించలేరు. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు ఏం చేస్తరు. 3 గంటల కరెంటుకు 10హెచ్‌పీ మోటర్లు ఎందుకు? ఆ మోటర్లు పెడితే బోర్లు పనిచేస్తయా? కొత్త బోర్లు వేసుకోవాలంటే లక్షలు ఖర్చయితయ్. రైతులపై ఎక్కువ భారం పడుతది. 3 గంటల కరెంట్‌తోటి రైతులు ఇబ్బంది పడాల్సిందె. పంటలు సాగు చేయడం సాధ్యం కాదు. కాంగ్రెసోళ్లు రైతులను గోస పెట్టుడు తప్ప ఏమీలేదు.

**- ఉట్నూరి కొంరయ్య, ఏటూరునాగారం**






## బోర్ల కాడ కావలి పండెటోళ్లం

గోవిందరావుపేట : కాంగ్రెసోళ్ల మాయ మాటలు నమ్మితే మునుపటి లెక్క కరెంట్ కష్టాలను కొని తెచ్చుకున్నట్లే అయితది. వాళ్ల పాలనలో రెండెకరాల భూమి సాగు చేయడానికి మస్తు కష్టాలు పడ్డం. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంట్‌తోటి కష్టాలు తీరి మంచిగ పంటలు సాగు చేసుకుంటున్నం. అప్పటి కరెంట్ గుర్తు చేసుకుంటే నేడు నిద్ర కూడా పట్టదు. కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. పంట పొలాలను నీళ్లు పెట్టేందుకు బోర్ల కాడ కావలి పన్నం. ఇయాల సంతోషంగా 24 గంటల కరెంట్‌తో రెండు పంటలు పండిస్తున్నం.

**- ముస్రగాని చేరాలు, రైతు, దుంపెల్లగూడెం, గోవిందరావుపేట మండలం**

## మళ్ల టార్చి లైట్లు కొనుడైతది..

భూపాలపల్లి రూరల్ : మునుపటి కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తదో తెల్వక రాత్రంతా మోటర్ కాన్నె ఉండెటోళ్లం. రాత్రి పూటనే వ్యవసాయానికి కరెంట్ ఇచ్చేది. పురుగో పుట్రో కాళ్ల కింద ఏముందో తెలవకుంట మొండిగ కరెంటు కాడికి పొయ్యి కరెంట్ పెట్టినం. ఒక్క మడి కూడా పారకుండానే కరెంట్ పోయేది. తెలంగాణ సర్కారు అచ్చినంక తిప్పలు తప్పినయి. రాత్రి పూట కరెంట్ కాడికి పోవుడు బంద్దైంది. పగటీలె పోయి కరెంట్ పెడుతున్న. మళ్లీ కేసీఆర్ అత్తనే మా రైతులం మంచిగుంటం. లేకుంటె మళ్లీ టార్చి లైట్లు కొనుక్కునుడైతది. కాంగ్రెస్‌ను నమ్ముకుంటె కరెంటు బంద్దైతది. మా గ్రామంలో 10 హెచ్‌పీ మోటర్లు ఏ రైతుకు లేదు. ఈ కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తం. 10 హెచ్‌పీ మోటర్లు వాడాలనడం విడ్డూరంగా ఉంది. ఉన్న బావుల్లో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను ఉపయోగిస్తున్నరు. వ్యవసాయం తెల్వనోడు మాట్లాడితే గిట్లనే ఉంటది.



**- బొడ్డు కృష్ణమూర్తి, భాస్కర్‌గడ్డ, భూపాలపల్లి**